సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 27 । జూన్ । 2024





**సోమశిలలో 10.090 టీఎంసీలు**

సోమశిల: జలాశయంలో బుధవారానికి 10.090 టీఎంసీల నిల్వ ఉంది. జలాశయానికి 392 క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | రూ.73,690 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము) | రూ.6,618 |
| మూడు శాతం జీఎస్టీతో | రూ.6,817 |
| నవర (8 గ్రాములు) | రూ.54,536 |

గరిష్టం/కనిష్టం
34.0 /27.2

**వాతావరణం**

జిల్లాలో గురువారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉండి, పగటి ఉష్ణోగ్రతలతో వేడి వాతావరణం ఉంటుంది. వాతావరణంలో తేమ 68 శాతం ఉంది.

# ఇసుక హాంఫట్




మర్రిపాడు ఇసుక డంపింగ్ యార్డులో టీడీపీ దొంగలు పడ్డారు. సామాన్య ప్రజల అవసరాలు తీర్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రీచ్‌ల నుంచి డంపింగ్ యార్డులో నిల్వ చేసిన రూ.కోట్లు విలువైన ఇసుకను పది రోజుల్లో ఖాళీ చేశారు. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఇసుక పాలసీపై నిర్ణయం ప్రకటించలేదు. ఈ లోపే రేయింబవళ్లు ట్రాక్టర్లు, టిప్పర్లు పెట్టి కొల్లగొట్టారు. గతంలో ఇసుక అక్రమ రవాణా చేస్తూ టీడీపీ నేతలు రూ.కోట్లకు పడగలెత్తారు. ప్రజలకు ఇసుక ఉచితమంటూనే రీచ్‌ల్లో టీడీపీ ముఠాలు యూనిట్లు లెక్కన సొమ్ము చేసుకున్నారు. ఈ పరిస్థితికి చెక్ పెట్టేందుకు ప్రతి రూపాయి ప్రభుత్వ ఖజానాకు చేరే విధంగా గత ప్రభుత్వం ఇసుక పాలసీ తెచ్చింది. ఇంత జరుగుతున్నా.. రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖలు ఆ వైపు కన్నెత్తి చూడలేదు.



మర్రిపాడు ఇసుక డంపింగ్ యార్డు నుంచి నిర్విరామంగా భారీ టిప్పర్లతో ఇసుక తరలిస్తున్న దృశ్యం

**కొత్త పాలసీ, ప్రభుత్వ నిర్ణయం రాక ముందే ఇసుక దోపిడీ**

- మర్రిపాడు డంపింగ్ యార్డులో 10 లక్షల క్యూబిక్ మీటర్ల మేర నిల్వ
- గత ప్రభుత్వంలో నిల్వ చేసిన ఇసుక డంప్‌లు మొత్తం ఖాళీ
- రేయింబవళ్లు ట్రాక్టర్లు, టిప్పర్లతో యథేచ్ఛగా తరలింపు

**ఆత్మకూరురూరల్ :** టీడీపీలోని ఇసుకాసురులు బరి తెగించారు. పదే పది రోజుల్లో రూ.10 కోట్ల విలువైన ఇసుకను దోచేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇసుక విక్రయం ద్వారా ప్రతి రూపాయి ప్రభుత్వ ఖజానాకు చేరే విధంగా ఇసుక పాలసీని అమలు చేసింది. ఖజానాకు చేరిన ప్రతి రూపాయి ప్రజలకే పంచింది. కానీ టీడీపీ ప్రభుత్వంలో గతంలోనూ ఆ పార్టీ నేతలు ఇసుక వ్యాపారంతో రూ.కోట్లు దోచుకున్నారు. తాజాగా మరోసారి అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతలు దోపిడీకి తెగడ్డారు.

### ఐదేళ్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం

ఇసుక దోపిడీకి కళ్లెం వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై టీడీపీ గత ఐదేళ్లు దుష్ప్రచారం చేశారు. 2014–19 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఇసుక ఉచితమని ప్రకటించింది. కానీ సామాన్య ప్రజలకు ఎక్కడా ఇసుక ఉచితంగా లభించిన దాఖలాలు లేవు. ఇసుక్ రీచ్‌ల్లో టీడీపీ నేతలు పాగా వేసి, కొన్ని రీచ్‌ల్లో స్వయంగా, మరి కొన్ని రీచ్‌ల్లో పొదుపు సంఘాలను పెట్టి పరోక్షంగా ఇసుక వ్యాపారం సాగించిన విషయం తెలిసిందే. యూనిట్‌కు రేటు కట్టి మరీ దోచుకున్నారు. చెన్నై, బెంగళూరు వంటి మహానగరాలకు చెక్ పోస్టుల్లో తనఖీలు లేకుండా యథేచ్ఛగా రవాణా సాగించారు. అప్పట్లో కాణికి టికాణి లేని టీడీపీ నేతలు ఐదేళ్లలో రూ.కోట్లకు పడగలెత్తారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇసుక దోపిడీకి కళ్లెం వేసింది. ఇసుక పాలసీ తెచ్చింది. పారదర్శకంగా ఇసుకను మైనింగ్‌శాఖ పర్యవేక్షణలో నేరుగా నిర్మాణ ప్రదేశాలకే తరలించే విధంగా ధరలు నిర్ణయించింది. ఇసుక ద్వారా వచ్చే ప్రతి రూపాయి ప్రభుత్వ ఖజానాకు చేర్చింది. గత ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడం టీడీపీ నేతలకు నచ్చలేదు. దీంతో ఇసుక సామాన్యులకు భారంగా మారిందంటూ, ఇసుక దొరకడం లేదంటూ ఇష్టానుసారం దుష్ప్రచారం చేసి ప్రజల్లో భయానక వాతావరణాన్ని సృష్టించింది. గత ప్రభుత్వం ఇసుక దోపిడీకి కళ్లెం వేస్తే.. టీడీపీ ప్రభుత్వం దోపిడీకి ద్వారాలు తెరిచింది.

### 10 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక ఖాళీ

గత ప్రభుత్వంలో ప్రభుత్వం నిర్దేశించిన ధరకు ఇసుకను ప్రైవేట్ వ్యక్తులకు సైతం విక్రయించేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇసుక యార్డులను ఏర్పాటు చేసింది. పెన్నానదిలో లభ్యమయ్యే అత్యంత నాణ్యమైన ఇసుకను ఆ యార్డులకు తరలించారు. ఇందులో భాగంగా మర్రిపాడుకు రెండు కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి పక్కనే ప్రభుత్వ ఇసుక డంపింగ్ యార్డు ఏర్పాటు చేసింది. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే నాటికి అక్కడ సుమారు 10 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను నిల్వ చేసింది. ఒక్కొక్క క్యూబిక్ మీటరు ఇసుక రూ.వెయ్యి వంతున ఈ మొత్తం విలువ దాదాపు రూ.10 కోట్లు ఉంటుంది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత మర్రిపాడు ఇసుక యార్డు నుంచి కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన మరుసటి రోజు నుంచే భారీ టిప్పర్ల ద్వారా అడ్డూ అదుపు లేకుండా యథేచ్ఛగా తరలిస్తున్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం కాగులపాడుకు చెందిన ఓ వ్యక్తి ఇసుక డంప్‌ను రూ.2 కోట్లకు కొనేసి.. చెన్నై, బెంగళూరు తదితర మహా నగరాలకు తరలిస్తున్నాడు. ప్రతి నిత్యం సుమారు 3,500 టిప్పర్ల (10 యూనిట్ల కెపాసిటీ ఉన్న టిప్పర్లు)తో ఈ పది రోజుల్లో ఇసుక డంప్ మొత్తం ఖాళీ అయిపోయింది. ఇక్కడ టిప్పర్ ఇసుక ధర రూ.30 వేల వంతున టీడీపీ వర్గాలు కొనేసి.. చెన్నై, బెంగళూరుకు తీసుకెళ్లి రూ.80 వేల నుంచి లక్ష రూపాయలకుపైగా ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. పక్క రాష్ట్రాలకు ఇసుక తరలించాలంటే బార్డర్ చెక్‌పోస్టుల్లో తనిఖీలు కూడా చేయడం లేదని తెలుస్తోంది. ఈ ఇసుక మాఫియాకు జిల్లాకు చెందిన అధికార పార్టీ ప్రముఖ నాయకుడి అండదండలు ఉండడం వల్ల ఏ అధికారి ఈ విషయంలో తలదూర్చేందుకు ఒణికిపోతున్నారని ప్రజల్లో తీవ్రమైన చర్చలు నడుస్తున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఇలా చేష్టలుడిగి చేతులెత్తేస్తే ప్రజలకు ఏ మేరకు న్యాయం చేస్తుందని బాహటంగా తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

## న్యూస్‌రీల్

### ఇన్‌చార్జి ఆర్వీఈఓగా భవాని హర్ష

**నెల్లూరు (క్రైమ్):** ఒంగోలు ఆర్వీఈఓ బి.భవాని హర్షను నెల్లూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి అధికారిగా నియమిస్తూ ఆ విభాగ డీజీ హరీష్‌కుమార్‌గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఉన్న కె.రాజేశ్వరరెడ్డి ఉద్యోగ విరమణ చేసినా కొంత కాలంగా ఓఎస్డీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆయన రాజీనామా చేయడంతో ఇన్‌చార్జిగా భవాని హర్షను నియమించారు.

### వీఎస్‌యూలో పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధ్యాపకులు

**వెంకటాచలం:** కాకుటూరులోని వీఎస్‌యూలో ఏపీఆర్‌సెట్ 2023–24 క్వాలిఫై అయిన అభ్యర్థులకు రెండో రోజు బుధవారం పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు కొనసాగాయి. తొలి రోజు జరిగిన సోషల్ వర్క్, రెండో రోజు టూరిజం మేనేజ్‌మెంట్, అప్లయిడ్ లైఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామని ఏపీఆర్‌సెట్ కో ఆర్డినేటర్ డాక్టర్ హనుమారెడ్డి తెలిపారు.

### మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఏఎస్పీ సీహెచ్ సౌజన్య



ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు, విద్యార్థులు

**నెల్లూరు (క్రైమ్):** మత్తు, మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాలను అంధకారం చేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య యువతకు సూచించారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నెల్లూరు నగర సబ్ డివిజన్, ఎస్‌ఈబీ పోలీసు అధికారులు, మహిళా పోలీసులు, వివిధ కళాశాలల విద్యార్థులు, స్థానిక పోలీసు కవాతు మైదానం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏఎస్పీ ర్యాలీని ప్రారంభించి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఏఎస్పీ సౌజన్య మాట్లాడుతూ మత్తు పదార్థాలకు ఒకసారి అలవాటు పడితే అది వ్యసనంగా మారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు ఏవీఆర్‌పీబీ ప్రసాద్, శ్రీనివాసరావు, నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డి, నగర ఇన్‌స్పెక్టర్లు అశోక్‌కుమార్, బాబి, సుబ్బారాజు, అల్తాఫ్‌హుస్సేన్, పీవీ నారాయణ, వీరానాయక్, ఆర్‌ఐ అంకమరావు, ఎస్‌ఈబీ అధికారులు, సిబ్బంది, మహిళా పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సగం ధరకే బంగారమని ఘరానా మోసం?

- లబోదిబోమంటున్న బాధితులు

**ముత్తుకూరు:** సగం ధరకే బంగారం ఇప్పిస్తామంటూ కొందరు వ్యక్తులను మోసగించి రూ.లక్షలతో ఉడాయించిన ఘటన ముత్తుకూరులో బుధవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. స్థానికుల ద్వారా అందిన సమాచారం మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన కొందరు వ్యక్తులు కృష్ణపట్నం పోర్టు సమీపంలో ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగం చేస్తున్నారు. పోలీసుల వేషధారణలో వచ్చిన కొందరు ప్రొద్దుటూరు వాసులకు సగం ధరకే బంగారం ఇప్పిస్తామని మాయమాటలు చెప్పారు. వీరి మాటలను నమ్మి దాదాపు రూ.10 లక్షల మేరకు డబ్బులు అందజేశారు. బంగారం ఇప్పిస్తామని నమ్మబలికి పోలీసు వేషంలో ఉన్న వ్యక్తులు ఏపీజెన్‌కో రోడ్డు వరకు వచ్చి ఆటోలో పరారయ్యారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితులు కృష్ణపట్నం పోలీసుస్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ అంశంపై పోర్టు ఎస్సై నాంచారయ్యను సంప్రదించగా, జరిగిన విషయంపై పూర్తి సమాచారం లేదని, ఫిర్యాదు చేస్తామంటూ కొందరు ఫోన్ ద్వారా తెలిపారని చెప్పారు. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### పది ఫలితాల్లో జిల్లాకు 8వ స్థానం

**నెల్లూరు (టౌన్):** పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా 8వ స్థానంలో నిలిచింది. పది ఫలితాలను బుధవారం విజయవాడలో విడుదల చేశారు. జిల్లాలో 78.44 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో 4,383 మంది పరీక్షలు రాయగా 3,438 మంది ఉత్తీర్ణత సాధించారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం వచ్చే నెల 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ పీవీజే రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### ఇంటర్ ఫలితాల్లో 55 శాతం ఉత్తీర్ణత

- రాష్ట్రంలో జిల్లాకు 2వ స్థానం

**నెల్లూరు (టౌన్):** బుధవారం విడుదలైన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రథమ సంవత్సర ఫలితాల్లో 55 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రస్థాయిలో జిల్లా 2వ స్థానంలో నిలిచింది. జనరల్‌కు సంబంధించి 6,910 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3,786 ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో 317 మందికి 211 మంది ఉత్తీర్ణులై 67 శాతంతో రాష్ట్రస్థాయిలో 3వ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ కళాశాలల విభాగంలో 16, ప్రైవేట్ విభాగంలో 2 జూనియర్ కళాశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. సంక్షేమ గురుకుల కళాశాలల్లో 95 శాతం, ఎయిడెడ్ కళాశాలల్లో 79 శాతం, కస్తూర్బా కళాశాలల్లో 79 శాతం, హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలల్లో 69 శాతం, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 60 శాతం, మోడల్ కళాశాలల్లో 54 శాతం, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలల్లో 53 శాతం ఉత్తీర్ణత సాధించాయి. రీ వెరిఫికేషన్‌కు వచ్చే నెల 4వ తేదీలోపు రూ.1000 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రిన్సిపల్స్, అధ్యాపకులను ఆర్ఐఓ శ్రీనావాసులు అభినందించారు.

### ఆత్మకూరు విద్యార్థినికి రాష్ట్ర ర్యాంకు



రాష్ట్ర స్థాయిలో ప్రథమ మార్కులు సాధించిన వి సుస్మిత

**ఆత్మకూరు:** ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఆత్మకూరు ప్రియదర్శిని కళాశాల విద్యార్థినీ వి సుస్మిత 470 మార్కులకు 467 మార్కులతో స్టేట్ ఫస్ట్‌గా నిలిచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. కళాశాలకు చెందిన బి హర్షిత, ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి 470 మార్కులకు 465 మార్కులు సాధించారని, షేక్ జుబేరియా 464 మార్కులు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారని ప్రిన్సిపల్ అభినందించారు.

## సమన్వయంతో ఘనంగా రొట్టెల పండగ

- మంత్రులు నారాయణ, ఆనం, ఎమ్మెల్యే కోటంరెడ్డి

**నెల్లూరు (బృందావనం):** మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బారాషహీద్ దర్గా రొట్టెల పండగను పటిష్ట ఏర్పాట్లతో ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని మంత్రులు నారాయణ, ఆనం, ఎమ్మెల్యే కోటంరెడ్డి తెలిపారు. వచ్చే నెల 17 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న రొట్టెల పండగ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై బుధవారం దర్గా ప్రాంగణంలోని ఈద్గాలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రొట్టెల పండగకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్, ఫుడ్ కోర్టులు ఏర్పాటు, నిరంతరాయ విద్యుత్ సరఫరా, పోలీస్ కంట్రోల్ రూం తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని నారాయణ పలు సూచనలు చేశారు. మంత్రి ఆనం మాట్లాడుతూ రొట్టెల పండగ జరిగే వారం రోజుల పాటు సంబంధిత అధికార యంత్రాంగంతో పాటు, సిబ్బంది తమ సెలవులు రద్దు చేసుకుని అంకితభావంతో పని చేయాలన్నారు. బారాషహీద్ దర్గాకు వచ్చే భక్తులు జిల్లాలోని కసుమూరు, అనుమసముద్రంపేట, వేనాడు తదితర దర్గాలను సందర్శిస్తారన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రొట్టెల పండగను ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలన్నారు. దర్గా ప్రాంగణంలో పరిసరాల్లో ఎటువంటి రాజకీయపరంగా ఫ్లెక్సీలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ రొట్టెల పండగకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పోలీస్ యంత్రాంగం చేపట్టే ఏర్పాట్లను వివరించారు. అనంతరం దర్గా పరిసరాలను, స్వర్ణాలచెరువు ఘాట్‌ను మంత్రులు అధికారులతో కలిసి పరిశీలించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్, మాజీ మేయర్లు భానుశ్రీ, అబ్దుల్‌అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణాలచెరువు వద్ద సమీక్షిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే, కమిషనర్, ఎస్పీ తదితరులు

**గత రెండేళ్లలో దర్గా ఎంతో అభివృద్ధి జరిగింది**

గత రెండేళ్లలో బారాషహీద్ దర్గా ఎంతో అభివృద్ధి చెందిందని అందుకు ప్రజాప్రతినిధులు ఎంతో కృషి చేశారని బారాషహీద్ దర్గా ఇమామ్ సయ్యద్ అబూబకర్ అష్రఫీ తెలిపారు.

## సాల్ట్ కమిషనర్ కుర్చీకి వినతిపత్రం

- నేరుగా పోర్టుకు వెళ్లిన కమిషనర్
- ఉప్పు రైతుల వినూత్న నిరసన

**ముత్తుకూరు:** మండలంలోని గోపాలపురం సాల్ట్ ఫ్యాక్టరీకి బుధవారం సాల్ట్ కమిషనర్ (రాజస్తాన్) ప్రేరణ జోషి వస్తున్నారన్న సమాచారంతో నిరీక్షించిన ఉప్పు రైతులకు చివరకు తీవ్ర నిరాశే మిగిలింది. కేంద్ర ప్రభుత్వ సాల్ట్ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించే అంశాన్ని పరిశీలించేందుకు, రైతుల సమస్యలు వినేందుకు కమిషనర్ ఉదయం 11 గంటలకు వస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో భాగంగా సాల్ట్ ఫ్యాక్టరీ వద్ద సమావేశం నిర్వహించేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. కమిషనర్ కోసం ప్రత్యేకంగా కుర్చీ, పూలమాలలు సమకూర్చారు. సాయంత్రం వరకు రైతులు ఎదురు చూశారు. అయితే కమిషనర్ నేరుగా సాల్ట్ ఫ్యాక్టరీకి రాకుండా కృష్ణపట్నంపోర్టుకు వెళ్లారు. పోర్టు నుంచి ఎంతకూ తిరిగిరాక పోవడంతో నిరాశ చెందిన రైతులు కమిషనర్ కోసం సిద్ధం చేసిన కుర్చీకి పూలమాల వేసి, తమ సమస్యల వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేసి వెళ్లిపోయారు. కార్యక్రమంలో సాల్ట్ రైతులు కోదండయ్య, బాబూరావు, శ్రీనివాసులురెడ్డి, రామప్రసాద్ రెడ్డి తదితరులు ఉన్నారు.




కమిషనర్ కుర్చీకి వినతిపత్రం అందజేస్తున్న ఉప్పు రైతులు

# మేయర్ కుర్చీకి ఫోర్జరీ బూచి

- కార్పొరేషన్‌లో పెత్తనం కోసమే టీడీపీ కుట్రలు, కుయుక్తులు
- మేయర్‌తో పదవికి రాజీనామా చేయించే దిశగా ప్రయత్నాలు
- ఆ సీటు ఖాళీగా ఉంచి డిప్యూటీ మేయర్‌కే అధికారం కట్టబెట్టేందుకు పన్నాగం
- అందుకోసమే తెరపైకి ఫోర్జరీ కేసు

నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ కుర్చీకి టీడీపీ నేతలు ఎసరు పెట్టారు. వైఎస్సార్‌సీపీ నుంచి మేయర్‌గా ఎన్నికైన ఆ గిరిజన మహిళను ఆ పదవి నుంచి బలవంతంగా రాజీనామా చేయించేందుకు కుట్రలు, కుయుక్తులు ప్రారంభించారు. మేయర్ దంపతులను వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసే విధంగా వారిని ఫోర్జరీ బూచితో బెదిరించి.. రెండు వారాలుగా మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో తమకు అనుకూలమైన సోషల్ మీడియా ద్వారా మేయర్ భర్త పాత్రపై విస్తృత ప్రచారం చేస్తూ పరిస్థితులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ఇదంతా కార్పొరేషన్‌లో పెత్తనం కోసమే అనే ప్రచారం జరుగుతోంది.




**నోరు విప్పని మంత్రి నారాయణ**

రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా నారాయణ తన శాఖ పరిధిలో ఉన్న నగరపాలక సంస్థలో రెండు వారాలుగా ఫోర్జరీ వివాదం నడుస్తోంది. ఆ శాఖ మంత్రిగా ఉన్న నారాయణ ఈ వ్యవహారంపై ఇప్పటి వరకు నోరు విప్పకపోవడంపై సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. కొందరు టీడీపీ ప్రజాప్రతినిధుల మైండ్ గేమ్ అర్థం చేసుకున్న నారాయణ ఈ వ్యవహారంలో తలదూర్చడానికి సందేహిస్తున్నారా? లేక ఆ మైండ్‌గేమ్‌లో ఆయన పాత్ర ఉందా? అనే అనుమానాలపై చర్చ నడుస్తోంది.

**సాక్షి ప్రతినిధి, నెల్లూరు:** నెల్లూరు నగరపాలక సంస్థ హోదాను సంతరించుకున్న తర్వాత మొదటిసారిగా ప్రథమ పౌరురాలిగా గిరిజన మహిళకు రిజర్వేషన్ కల్పిస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసింది. కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి నెల్లూరు 12 డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికైన పొట్లూరి స్రవంతిని మేయర్‌ను చేసింది. అయితే రాష్ట్రం, జిల్లాలో అధికార మార్పిడి జరగడంతో టీడీపీ ప్రభుత్వ నేతలు నగరపాలక సంస్థలో పెత్తనం కోసం రాజకీయ కుట్రకు తెర తీశారు. మేయర్ పదవిలో ఉన్న గిరిజన మహిళను టార్గెట్ చేసి ఆమె భర్త జయవర్ధన్ తన భార్య అధికారాన్ని అడ్డం పెట్టుకుని కార్పొరేషన్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు తెరపైకి తెచ్చారు. వైఎస్సార్‌సీపీలో ఉన్న మేయర్ దంపతులను టీడీపీలోకి చేర్చుకునేందుకు టీడీపీ నేతలు కుయుక్తులు పన్నడంతో భయపడిపోయిన వారు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మీడియా సముఖంగానే నెల్లూరు రూరల్ ప్రజాప్రతినిధిని శరణు వేడుతూ, క్షమాపణలు అడిగారు. దీన్ని బట్టి టీడీపీ నేతలు కుట్రలు, కుతంత్రాలు చేశారని అర్థమవుతోంది. మేయర్ దంపతులపై టీడీపీ నేతలు కుట్రలు చేస్తున్నారనే ప్రచారం జరగడంతో తాజాగా మరో కొత్త వ్యూహాన్ని రచించారు.

**డిప్యూటీ మేయర్‌తోనే..**

నగరపాలక సంస్థ కమిషనర్ సంతకం ఫోర్జరీ వ్యవహారంలో మేయర్ దంపతుల ప్రమేయం ఉందని బూచిగా చూపి ఆమెతో తన పదవికి రాజీనామా చేయించే కుట్రలు పన్నుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. రెండు వారాలుగా గిరిజన మహిళను మానసిక క్షోభకు గురి చేస్తున్న టీడీపీ నేతలు త్వరలోనే మేయర్ సీటును ఖాళీ చేయించి.. డిప్యూటీ మేయర్‌ను ఇన్‌చార్జి మేయర్ స్థానంలో కూర్చొబెట్టి తమ పెత్తనం సాగించే ప్రయత్నాలు ముమ్మరం చేశారని కార్పొరేషన్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మేయర్ తన పదవికి రాజీనామా చేసే విధంగా విచారణలో ఉన్న ఫోర్జరీ వ్యవహారాన్ని తమకు అనుకూల సోషల్ మీడియాలో మేయర్ భర్త ప్రమేయం ఉన్నట్లుగా చిలువలు పలువలుగా ప్రచారం చేస్తున్నారు.

### టీడీపీ హయాంలో జరిగిన తప్పును..

**గతంలో వైఎస్సార్‌సీపీ నుంచి మేయర్‌గా** ఎన్నికై.. ఆ తర్వాత టీడీపీలోకి ఫిరాయించిన అబ్దుల్ అజీజ్ హయాంలో జరిగిన తప్పులను ప్రస్తుత మేయర్ స్రవంతి భర్తకు ముడిపెట్టి భయపట్టే కుట్రలు జరుగుతున్నాయి. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ల సంతకాలు ఫోర్జరీ చేసి మార్ట్‌గేజ్‌లో ఉన్న భవనాలను విడుదల చేయించి దాదాపు రూ.15 కోట్ల మేర కార్పొరేషన్ ఆదాయానికి గండి కొట్టారనేది ప్రధాన ఆరోపణ. వాస్తవంగా కార్పొరేషన్ పాలన వ్యవహారాలు అన్ని కూడా ఆన్‌లైన్‌లోనే జరుగుతాయి. మార్ట్‌గేజ్‌లో ఉన్న భవనాలను రిలీజ్ వ్యవహారం కూడా ఆన్‌లైన్ ద్వారానే జరుగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఈ విధానం ఎక్కడా మాన్యువల్‌గా జరగలేదు. గతంలో టీడీపీ హయాంలో బీపీఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికే మాన్యువల్‌గా చేశారు. అయితే టీడీపీ అధికారంలోకి రాగానే కార్పొరేషన్‌లో కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు ఏ సంబంధం లేని ఓ న్యాయవాది ద్వారా ఫిర్యాదు చేయించడం, ఆ ఫిర్యాదుపై ప్రాథమిక విచారణ జరగకుండానే సోషల్ మీడియాలో నలుగురు వైఎస్సార్‌సీపీ నేతలకు ఉచ్చు అంటూ పోస్టులు పెట్టించడం చూస్తే ఇదంతా రాజకీయ కుట్రలో భాగమనే చర్చ జరుగుతోంది. కేవలం కార్పొరేషన్‌పై పెత్తనం కోసం టీడీపీ ప్రజాప్రతినిధుల మైండ్ గేమ్‌తో మేయర్ దంపతులతో వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసేలా ప్రయత్నించి సక్సెస్ అయ్యారు. ఇదీ చాలదన్నట్లు ఇంకా వారిపై ఒత్తిడి పెంచి మేయర్ పదవి నుంచి దించేసే కుట్రలు, కుతంత్రాలు కొనసాగిస్తున్నారు.

**మీడియా ముందుకు రాని కమిషనర్**

రెండు వారాలుగా కార్పొరేషన్‌లో కమిషనర్ల సంతకాలు ఫోర్జరీ చేసి కార్పొరేషన్ ఆదాయానికి గండి కొట్టారనే ప్రచారంపై ప్రాథమిక విచారణలో కూడా నిజమేనని తేలింది. ఈ వ్యవహారాన్ని విజిలెన్స్‌కు అప్పగించారు. నలుగురు టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఉద్యోగులను సస్పెండ్ చేశారు. అయితే కార్పొరేషన్‌లో ఏం జరుగుతుందనే విషయంపై కమిషనర్ మీడియా ముఖంగా ఎందుకు వెల్లడించలేదనే ప్రశ్నలు, అనుమానాలు తలెత్తుతున్నాయి. నిజంగా తన సంతకం ఫోర్జరీ జరిగి ఉంటే ఫోరెన్సిక్‌కు పంపారా? అలా ఎందుకు చేయలేదు. కేవలం అధికారులను బలి చేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఫోర్జరీ వ్యవహారం నిజమైతే వాస్తవాలు బయట పెట్టేందుకు కమిషనర్ ఎందుకు జంకుతున్నారని రాజకీయ వర్గాలతో పాటు నగర ప్రజలు కూడా నిలదీస్తున్నారు. ఈ వ్యవహారం అంతా రాజకీయ కోణంగా ఉండడంతోనే మీడియా ముందుకు వచ్చే సాహసం చేయలేదనే చర్చ జరుగుతోంది.

# వెంగమాంబ కల్యాణం.. కనులారా వీక్షించి..

- జనసంద్రమైన నర్రవాడ
- నేటితో ఉత్సవాలు ముగింపు

**దుత్తలూరు:** భక్తజన సందోహం నడుమ వెంగమాంబ – గురవయ్యల ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారు కనులారా వీక్షించి తరించారు. మండలంలోని నర్రవాడలో వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కల్యాణోత్సవానికి ముందుగా ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రధాన ఆలయం నుంచి వేదిక వద్దకు మంగళవాయిద్యాల నడుమ తీసుకొచ్చారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆయన కుటుంబసభ్యులు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వెంగమాంబ పుట్టినిల్లు అయిన వడ్డిపాళెం నుంచి పసుపు, కుంకుమను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగింపుగా దేవస్థానం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను వేదికపై ఉంచి వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. పచ్చవ, తుమ్మల, వేమూరి వంశస్తులు వెంగమాంబ తల్లికి కల్యాణం జరిపించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకెళ్లి పల్లకి సేవ నిర్వహించారు.

- బుధవారం రాత్రి వడ్డిపాళెం గ్రామంలో హంస వాహనంపై వెంగమాంబ – గురవయ్య ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అంగరంగ వైభవంగా ప్రధానోత్సవం నిర్వహించారు. దారిపొడవునా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వడ్డిపాళెం నుంచి ప్రారంభమైన ఈ ప్రతానోత్సవం నర్రవాడ వీధుల మీదుగా కొనసాగింది.
- బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన గురువారం పొంగళ్లు, ఎడ్లు బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశమున్నందున పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటల నుంచే ఎడ్ల పందేలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు.



పసుపు, కుంకుమను ప్రత్యేక వాహనంలో తరలిస్తున్న భక్తులు



కల్యాణోత్సవం సందర్భంగా పూజలు



మంగళసూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న వేదపండితుడు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



సుగాళీల వీరతాండవం

# ప్లాస్టిక్ పైపుల దుకాణంలో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పేందుకు కిటికీ అద్దాలను పగులగొడుతున్న అగ్నిమాపక సిబ్బంది



కాలిపోయిన ప్లాస్టిక్ వస్తువులు

- రూ.9 లక్షల నష్టం

**నెల్లూరు(క్రైమ్):** విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం నెల్లూరు కనకమహల్ సెంటర్‌లోని పీఎస్ ఆర్ అండ్ సన్స్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిమాపక శాఖ అధికారుల కథనం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన పి.జనార్దనరావు, సీతారామయ్య కనకమహాల్ సెంటర్‌లో పీఎస్ ఆర్ అండ్ సన్స్ పేరిట పైపులు, సింటెక్స్, మోటార్ సామాన్లను విక్రయిస్తున్నారు. బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దుకాణంలో మంటలు వ్యాపించాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు వ్యాపించడంతో సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. నెల్లూరు అగ్నిమాపక సహాయ అధికారి వేణుగోపాల్ నేతృత్వంలో సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది నిచ్చెన సాయంతో కిటికీ అద్దాలను పగులగొట్టి మొదటి, రెండో అంతస్తుల్లోకి ప్రవేశించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.9 లక్షల విలువ చేసే పీవీసీ పైపులు, సింటెక్స్ డ్రమ్‌లు, బ్రాంజ్ మెటీరియల్, వాటర్ పైపులు తదితరాలు దగ్ధమయ్యాయని యజమానులు పేర్కొన్నారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో భారీ ప్రమాదం తప్పింది.

## నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | | | |
|---|---|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 140 | బ్రాయిలర్ | |
| లేయర్ (లైవ్) | : 120 | స్కిన్‌లెస్ | : 280 |
| బ్రాయిలర్ చికెన్ | : 250 | లేయర్ చికెన్ | : 204 |



## కారు ఢీకొని వ్యక్తి మృతి



**నెల్లూరు సిటీ:** స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని కారు వేగంగా ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతిచెందిన ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలంలోని వావిలేటిపాడు గ్రామంలో జొన్నలగడ్డ సుధాకర్ (55) భార్యాపిల్లలతో నివాసం ఉంటున్నాడు. అతను నారాయణ హాస్పిటల్లో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకుని హాస్పిటల్ నుంచి స్కూటీపై బయలుదేరాడు. ధనలక్ష్మీపురం వద్ద ముత్తుకూరు నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారు స్కూటీని వేగంగా ఢీకొంది. దీంతో సుధాకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ ఇన్‌స్పెక్టర్ మారుతీకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వ్యసనాలకు బానిసై బైక్ దొంగతనాలు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- 21 మోటార్‌బైక్‌ల స్వాధీనం

**నెల్లూరు(క్రైమ్):** వ్యసనాలకు బానిసైన ముగ్గురు యువకులు మోటార్‌బైక్‌లను దొంగలించి పోలీసుల కళ్లుగప్పి తిరగసాగారు. వారి కదలికలపై నిఘా ఉంచిన సీసీఎస్, కావలి పోలీసుల ప్రత్యేక బృందం కావలి తుమ్మలపెంట రోడ్డు వద్ద బుధవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 21 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ నిందితుల వివరాలను వెల్లడించారు. బోగోలు మండలం కప్పరాళ్లతిప్పకు చెందిన పి.భానుప్రకాష్, జి.గోమ్స్, జి.హనుమాన్‌లు స్నేహితులు. వీరు చిన్నతనం నుంచే చెడువ్యసనాలు, జల్సాలకు బానిసయ్యారు. అవసరాలను తీర్చుకునేందుకు రెండు సంవత్సరాలుగా నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో బైక్‌లను దొంగతనం చేసి వాటిని అమ్మి సొమ్ము చేసుకుని జల్సాగా జీవించసాగారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కోటేశ్వరరావు, కె.సాంబశివరావు, కావలి ఒకటో పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజేష్ తమ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుల కదలికలపై నిఘా ఉంచారు. సాంకేతికత ఆధారంగా బుధవారం నిందితులు కావలి పట్టణం తుమ్మలపెంట రోడ్డు వద్ద ఉండగా ప్రత్యేక బృందం నిందితులను అదుపులోకి తీసుకుని కావలి ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

**రూ.15 లక్షల విలువ చేసే..**

కావలి ఒకటో పట్టణం, కావలి రూరల్, చీరాల ఒకటో పట్టణం, ఒంగోలు రూరల్, కనిగిరి పోలీసు స్టేషన్ల పరిధిలో రూ.15 లక్షల విలువ చేసే 21 బైక్‌లను దొంగతనం చేసినట్లు నిందితులు విచారణలో వెల్లడించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి దొంగతనం చేసిన బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేసి లక్షల రూపాయలు విలువ చేసే బైక్‌లను స్వాధీనం చేసుకునేందుకు కృషి చేసిన సీసీఎస్, కావలి డీఎస్పీలు పి.రామకృష్ణాచారి, ఎం.వెంకటరమణ, సీసీఎస్, కావలి ఇన్‌స్పెక్టర్లు, కావలి ఎస్సై రాజేష్, సీసీఎస్ సిబ్బంది రావు గిరిధర్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, శ్రీనివాసులు, కరిముల్లా, సాయి ఆనంద్, నిరంజన్, విజయ్, శివకృష్ణ, సురేష్, కావలి సిబ్బంది షఫీఉల్లాఖాన్, రవీంద్ర, అశోక్‌కుమార్ తదితరులను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో క్రైమ్ ఏఎస్పీ ఏపీ ఆర్‌పీబీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లు



# మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ రసాభాస

**పొదలకూరు:** మండలంలోని లింగంపల్లికుంట చెరువు వద్ద తెల్లరాయి మైనింగ్ చేసేందుకు బుధవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ రసాభాసగా మారింది. ఉదయం అధికారులు అభిప్రాయ సేకరణ చేస్తున్నారని తెలుసుకున్న లింగంపల్లి, చిట్టేపల్లి, తోకంచి గ్రామాలకు చెందిన వారు అక్కడికి చేరుకుని తెల్లరాయి మైనింగ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులకు తెలియకుండానే ఈ ప్రక్రియ చేపట్టడం ఏమిటని ఆర్డీఓ మలోలతో వాగ్వాదానికి దిగారు. మైనింగ్ చేస్తే మూడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని, అనుమతులిస్తే ఒప్పుకొనేది లేదని హెచ్చరించారు. ఎంపీటీసీ గుంటి శ్రీనివాసులు మాట్లాడుతూ తెల్లరాయి మైనింగ్ చేపట్టేందుకు నిర్వహించే అభిప్రాయ సేకరణ గురించి తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్విరాన్మెంటల్ ఈఈ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వలేదనే విషయం తమకు తెలియదని, మరోసారి అందరికీ తెలియజేసి అభిప్రాయ సేకరణ చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకున్న వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు మస్తాన్‌బాబు, నాయకులు బోగోలు భాస్కర్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

# సంగంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు

- టిప్పర్, జేసీబీ స్వాధీనం

**సంగం:** మండల కేంద్రమైన సంగం ఇసుక రీచ్‌లో అక్రమంగా జరుగుతున్న తవ్వకాలపై మంగళవారం అర్ధరాత్రి సెబ్ సీఐ యశోదర, ఎస్సై నాగార్జునరెడ్డి దాడులు నిర్వహించారు. రీచ్ పరిసర ప్రాంతాల్లో ఉన్న జేసీబీ, టిప్పర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండలంలో అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సెబ్ సీఐ హెచ్చరించారు.



దాడులు చేసిన సెబ్ సీఐ, ఎస్సై

# శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

**నెల్లూరు(సెంట్రల్):** వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ సాగు చేస్తే పంటలో తెగుళ్ల నివారణ ఎంతో సులభతరమని సెంట్రల్ అగ్రికల్చరల్ ప్రతినిధి మధుమంజరి అన్నారు. నెల్లూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో వివిధ అంశాలపై బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తగిన మోతాదులో ఎరువులు, మందులు వాడడం వల్ల మంచి ఫలితాలను వస్తాయన్నారు. ఆత్మ పీడీ దొరసానమ్మ మాట్లాడుతూ పంటల సాగుపై రైతులకు ఎటువంటి సందేహాలున్నా వ్యవసాయ శాఖ అధికారులను లేదా శాస్త్రవేత్తలను సంప్రదించాలన్నారు. అనంతరం అన్నదాతలకు సూచనలిచ్చేందుకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అధికారులు సత్యవాణి, శివన్నారాయణ, వినీత తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు

# రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

- భార్య పరిస్థితి విషమం

**మర్రిపాడు:** మండలంలోని చుంచులూరు సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారి బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. అనంతసాగరం మండలం వడ్డిపాళేనికి చెందిన మల్లి శ్రీరాములు, అతని భార్య అనూష తమ పిల్లలకు స్కూల్ ఫీజు కట్టేందుకు మోటార్‌బైక్‌పై బయలుదేరారు. ఈక్రమంలో కారు వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో భారాభర్తలు గాయపడ్డారు. కాగా అనూష పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రైవేట్ వాహనంలో క్షతగాత్రులను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.